

# వరకట్న నిషేధము

"మీకు ఓ శుభవార్త తెచ్చాను."

"ఏమిటది ?"

"ఊహూ. చెప్పను."

"చెబుదూ!"

"ఊహూ!"

తల అడ్డంగా ఊపింది. నవ్వుతూ కొంటెగా నా కళ్లల్లోకి చూస్తూ అంది: "చెబితే నాకేమి ఇస్తారు?"

"అబ్బ! చంపక చెబుదూ!" ప్రాధేయపడ్డాను. కాని, వెంకీఘటం దిగివస్తేనా?

"నా కేమిస్తారో ముందు చెప్పండి!"

"ఏం కావాలి?"

"మీరే చెప్పాలి."

"ఆ, అయితే చెప్పనా?"

"ఊఁ"

"కోప్పడవు కదూ?"

"ఊహూ." తల అడ్డంగా తిప్పింది. కాని, ఏం చెబుతానో అని అనుమానంగా నావేపు చూడకపోలేదు.

"ఓ తియ్యని ముద్దు!"

ఆవిడ ఎగిరి గంతేసింది. ముఖంలో చిరుకోపం బిందులు తొక్కింది. "ఛస్! ఆనేం మాటలు? ఎవరన్నా వింటే నవ్విపోతారు. నేను నేడో రేపో పసుపుబట్టలతో పెళ్లిపీట అలంకరించబోతున్నాను. ఇక మీరు ఇలాంటి మాటలు అంటే బాగుండదు సుమండీ!"

నా కంతా అయోమయంగా ఉంది. ఆవిడేమి చెబుతుందో అర్థం చేసుకొనే స్థితిలో లేను. "ఏమిటి మాధవీ, నీ వంటున్నది?" ఆత్రంగానే అడిగాను.

చేతులు వెనక్కి కట్టి చెవిటివాడికి చెప్పినట్టు నొక్కినొక్కి చెప్పింది — "నేను పెళ్ళి చేసుకోబో తున్నాను" అని.

"నిజంగానా, మాధవీ?"

ఆవిడ ముఖం అదోలా పెట్టి "అబ్బే, అబద్ధం" అంది.

"ఏమిటి, మాధవీ? నన్నేడిపించకు. నిజం చెప్పు." రెండు చేతులు పట్టుకొని ప్రాధేయపడుతూ అడిగాను

ఆమెకు నామీద జాలి వేసింది కాబోలు! "నిజం చెబితే నమ్మరుగా, మరి!"

"అయితే, నిజమేనంటావా?"

"........."

"వేళాకోళ మాడుతున్నావా?"

"ఇన్విటేషన్ అందుకుంటే నమ్ముతారులెండి."

ఇక నమ్మక తప్పిందికాదు. అయినా మాధవి ఇందులో అబద్ధమాడవలసిన అగత్యంకూడా లేదు. నా గుండెల్లో రాయి పడ్డట్టయింది. నా కాళ్లకింద భూమి గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది. "ఇదేనా మాధవీ, నీవు నాకు వినిపిస్తానన్న శుభవార్త?"

"అవును, ఏం? నేను పెళ్లాడ్డం మీ కిష్టం లేదా?" ఆవిడ అదోలా ముఖంపెట్టి వింతగా నా ముఖంలోకి గుచ్చి చూస్తూ ప్రశ్నించింది.

ఆవిడ వాలకం నా కేమీ అర్థం కాలేదు. అయితే ఆవిడ నన్ను ప్రేమించడంలేదా? నే నావిణ్ణి తప్పుగా అర్థంచేసుకొన్నానేమో! ఆవిడకి నే నేమని జవాబు చెప్పను? నే నామెను ప్రేమిస్తున్నానని ఎలా చెప్పను? చెబితే ఆవిడ ఏమనుకుంటుంది?

నా ఆశలన్నీ గగనకుసుమాలు కావలసిందేనా? ఇన్నాళ్ళుగా నేను కట్టిన గాలిమేడలు నేటితో కూలి పోవలసిందేనా?

అయినా ఆవిడ నాతో ఎందు కలా ప్రవర్తించాలి? కలిసికట్టుగా తిరిగినంత మాత్రాన, స్నేహభావంతో మెలిగినంత మాత్రాన ఆడదాన్ని అలా అపార్థం చేసు కోవడం నాదే తప్పేమో!

"నన్ను పరీక్షిస్తున్నావా, మాధవీ!" నా హృదయం లోంచి వెలువడిన ఈ మాటల్లోని ఆవేదన ఆమెకు అర్థం అయిఉండకపోదు.

ఆవిడ కిలకిలా నవ్వింది. "ఈమధ్య కవిత్వం కూడా నేర్చుకుంటున్నారల్లే ఉందే?" వాలుచూపులతో నా హృదయాన్ని తూట్లు పొడిచేస్తూంది.

ఇక భరించలేకపోయాను. "మాధవీ! నిజం చెప్పు నీవు నన్ను ప్రేమించడం లేదూ?"

నా ఆవేదన అర్థం చేసుకుని ఉంటుంది నామీద జాలిపడి ఉంటుంది. నన్నిక ఏడిపించదలుచుకోలేదు అందుకనే ఆవిడ తల వాల్చేసింది. కాలి బొటనవేలితో నేలమీద గీస్తూ, ముంచుకువచ్చిన సిగ్గుతో సన్నగా అంది: "లేదని ఎవరు అన్నారు?"

"నిజంగానా, మాధవీ!" ఆత్రంగా రెండు చేతులూ జవిరి పట్టుకున్నాను. "మరి, ఈ పెళ్ళికి ఎలా ఒప్పుకున్నావ్?"

"ఒప్పుకోక ఏం చెయ్యమన్నారు!" నా కళ్లలోకి చూస్తూ ప్రశ్నించింది.

నిజంగా మరొకప్పుడయితే అలాంటి ప్రశ్నకు

నవ్వి ఉండేవాణ్ణి. "నా కిష్టం లేదని చెప్పలేక పోయావా?"

"చెబితే ఆగిపోతుందా?"

"అలా అనిజీవితాన్ని దుఃఖభాజనంచేసుకుంటావా?"

"గత్యంతరం?"

"ఆలోచిస్తే గత్యంతరమే లేకపోలేదు."

"అయితే అదేదో మీరే ఆలోచిద్దురూ!" అతి నిర్లక్ష్యంగా తనకేమీ పట్టనట్లే భారం అంతా నామీద వేసింది.

ఆలోచించాను. మనసులో ఓ ఆలోచన మెరుపులా తట్టింది. "నేనేం చెబితే అది చేస్తావా?"

"తప్పకుండా."

"తప్పితే?"

"మీా కెందు కా అనుమానం?"

"వెంటనే ఇక్కడినించి వెళ్ళిపోవాలి."

"ఎక్కడికి?"

"ఎక్కడికైనా? ఈ పాడు వూాకకి అంతుపట్టని చోటుకి."

"అంటే?"

"కన్నుగానని దేశానికి."

"ఇల్లాగే?"

"ఏం, భయం వేస్తోందా?"

"అబ్బే! అందుకు కాదు."

"మరి?"

"ఆ ... ఊరికే అడిగాను."

"సిద్ధమేనా?"

"రెడీ."

కట్టుబట్టలతోనే బయలుదేరాం రైల్వేస్టేషన్‌కు. కలకత్తా మెయిల్ రావడానికి పావుగంట ఉంది. టిక్కెట్లు ఇస్తున్నారు. అప్పటికిగాని జ్ఞాపకం రాలేదు పర్సులో రూపాయిన్నరకంటె ఎక్కువ లేదన్న సంగతి. తీరా ఇప్పుడు ఏం చెయ్యాలో తోచిందికాదు.

నా అవస్థ అంతా గమనిస్తున్న మాధవి తన హాండ్ బాగ్‌లోంచి రెండు టిక్కెట్లు పైకితీసి చూపుతూ, "ప్రొద్దుటే కొనిపెట్టాను. సీట్లు రిజర్వు కూడా చేయించాను. నేరుగా కలకత్తాకే" అంది.

నాకు ఆశ్చర్యం వేసింది. మాధవి ఈ ప్రయాణాన్ని ముందే స్థిరపరిచింది. తన నిశ్చయాన్నే నాచేత చెప్పించ డానికి ఇంత నాటకం ఆడింది. మాధవి ప్రయాణానికి సిద్ధమయ్యే వచ్చింది. దారి ఖర్చులకు, నెలకంతా సరిపోయే అందుకు డబ్బుకూడా తెచ్చింది.

మొత్తానికి మాధవి చాలా గమ్మత్తయిన పిల్ల. ఎప్పుడు హుషారుగా లేడిపిల్లలా గంతులేస్తూ, నవ్వుతూ, చలోక్తులు దొర్లిస్తూ మాట్లాడుతుంది. ఆవిణ్ణి అర్థం చేసుకోవడం చాలా కష్టం. కొమ్ములు తిరిగిన మనస్తత్త్వ శాస్త్రవేత్తలకే అంతుపట్టని మనిషి మాధవి! మాటకారి. తలపెట్టిన కార్యాన్ని కొనసాగించగలననే ఆత్మవిశ్వాసం, కార్యదీక్ష ఉన్న పిల్ల. ఆవిడ అనుకుంటే మనిషిని ఏడిపించగలదు; నవ్వించ గలదు.

ప్రప్రథమంగా ఆవిడతో నాకు పరిచయమైంది బస్సులో. ఎవరో అమ్మాయి పచ్చగా, ఒడ్డుపొడుగ్గా, వాలుజడ వేసుకొని, సన్నని తెల్లచీర, గులాబిరంగు

కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవడం మగ వాడికి నామర్దా. కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోవడం కన్నెపిల్లకు నామర్దాయే అయినా అంతటి స్తోమతు పిల్ల తల్లి దండ్రులకు ఉండదు. ప్రేమ గీమ పెట్టుకుని పెళ్ళి చేసుకోవచ్చు. ప్రేమించు కుండా ఉండడం ఎలా సాధ్యం? పరిస్థితులు విషమించినప్పుడు పిల్లలు పారిపోవడం ఏదో లోపం తప్పనిసరైతే అప్పుడు చేయవలసిన పని లేదు, మరి.

చోళీ తొడుక్కుని ఓ చేత్తో పుస్తకాలు పట్టుకుని నిల్చుంది. జనం కిటకిటలాడుతున్నారు. నిలబడే టందుకయినా చోటు లేదు. బస్సు కదిలితే ఆవిడ పడుతుంది. సరిగ్గా తనమీదే తూలి పడుతుంది. మగవాడు అయితే ఎలాగో నిలదొక్కుకోగలడు. కాని, అబల! అందుచేత నేను లేచి నుంచుని ఆవిణ్ణి ఆ స్థలంలో కూచోమన్నాను. ఆవిడ కృతజ్ఞతతో నావైపు చూసి చిరునవ్వు చిలికి, కూచుంది. బస్సు కదిలింది.

నేను దిగే చోటే ఆవిడకూడా దిగిపోయింది. రోడ్డు మలుపువరకూ నడిచి విడిపోయాం.

రోజూ ఇలాగే జరిగేది. బస్సు ఎక్కీ-ఎక్కడంతో ఆవిడ చిలిపికళ్ళు నాకోసం (బహుశ నాకోసమే) వెతుకులాడేవి. నేను కంటపడగానే సిగ్గుతో, బరువుగా వాలిపోయేవి ఆమె కన్నులు. ఆ మధుర క్షణాల కోసమే ఎదురుతెన్నులు కాస్తున్న నేను, లేచి నుంచుని ఆవిడకు సీటు ఆఫర్ చేసేవాణ్ణి. ఆవిడ సిగ్గుతో తల వాల్చేది.

మునుపాటి చెంపల్ని, చెంపలమీద జీరాడే ఉంగ రాల జుట్టుని, అందమయిన మెడని, గుండ్రటి భుజాలని చూస్తూ నుంచుండిపోయేవాణ్ణి.

ఎప్పుడైనా ఆవిడ కనిపించకపోతే నా మనస్సు ఎందుకో ఆరాటపడేది.

ఆవిణ్ణి పలకరించాలని, ఆవిడతో మాట్లాడాలని మనస్సు ఉబలాటపడేది. కాని సమయము, సందర్భము కలిసిరాలేదు.

ఆ రోజు మామూలుగానే ఇద్దరం బస్సు దిగాం ఆవిడ ముందు నడుస్తోంది. నేను వెనకాలే నడుస్తు న్నాను. ఆవిడ చటుక్కున వెనక్కి తిరిగింది. ఆవిడ చిన్ని నడుమునీ, హంసగమనాన్నీ వర్ణిస్తున్న నన్ను చూసి నవ్వి, చటుక్కున ముఖం తిప్పేసుకుంది. నేను లజ్జతో కుంగిపోయాను.

నాలుగడుగులు వేసేసరికి ఆవిడ చేతిలోంచి రుమాలు జారి కింద పడింది. వంగి అందుకున్నాను ఆవిడ నడుస్తోంది. పిలిచాను. చేతిలోని రుమాలు ఆవిడికి ఇచ్చాను. ఆ దొరికిన తరుణాన్ని వృథాగా పోనీకుండా మాట కలిపాను. రోడ్డు మలుపువరకూ అవీ ఇవీ మాట్లాడుతూ వెళ్ళాం. ఆవిడ నాదగ్గిర సెలవు తీసుకుని నేరుదారికి చీలిపోయింది.

రోజూ ఇలాగే రోడ్డుమలుపువరకూ అవీ ఇవీ

**టి. శ్రీదేవి**

మాట్లాడుతూ కలిసే వెళ్ళేవాళ్ళం. ఆవిడ మాట్లాడు తున్నంతసేపు ఏ స్వర్గధామంలోనో, ఏ పుష్పసార ఝంలోనో తేలిపోతున్నట్లు అనిపించేది. మా హృదయాలు సన్నిహిత సంబంధాన్ని పెంచుకున్నాయి. ఒకరికోసం ఒకరు పుట్టినట్లు, ఒకరి సమక్షంలో ఒకరు ఉండడమే న్యాయమైనట్లు అనిపించేది. అప్పుడప్పుడు మేము పార్కులోనో, సముద్రపుటొడ్డునో కలుసుకునే వాళ్ళం. సరదాగా కాలం వెళ్ళబుచ్చేవాళ్ళం.

మొన్న నారాయణరావు స్టేషన్‌లో కనిపించి చెప్పాడు. మా నాన్నగారు మా కెక్కడో మంచి సంబంధమే చూస్తున్నారట. అయినసంబంధమేనట. కట్నాలు, కానుకల విషయంలో కాస్త వెనకాముందూ అవుతుందే గాని, లేకపోతే ఈపాటికి పెళ్ళి అయిపోయి ఉండేదట. నేడో రేపో నాన్నగారి దగ్గిరనుంచి ఉత్తరం రావచ్చునని చెప్పాడు. నాకు ముచ్చెమటలు పోశాయి. 'నా ఇష్టా నిష్టాలతో నిమిత్తం లేకుండానే నా పెళ్ళి నిశ్చయం చేస్తారా?' అనుకున్నాను. కాని, నాన్నగారు నిజంగా కర్కోటకుడు. ఆయన మాటకు తిరుగులేదు. అందుచేత ఈ ప్రమాదం తప్పేది ఎలాగో తెలీక తికమకపడుతున్న సమయంలో మాధవి పెళ్ళివార్త నన్ను పిచ్చివాణ్ణిగా చేసిందంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఎలాగయితేనేం ఇద్దరం మెయిల్లో పడ్డాం.

మా ప్రోగ్రామ్ ప్రకారం కలకత్తా చేరగానే రిజిస్ట్రర్డ్ మారేజి చేసుకోవటం, ఓ చిన్న పోర్షన్ అద్దెకు తీసుకొని కాపరం పెట్టటం, ఇద్దరం ఉద్యోగ ప్రయ త్నాలు చెయ్యడం క్రమంగా జరిగిపోయాయి. నెల తిరక్కముందే ఎలాగో తంటాలుపడి ఓ బాంకులో గుమాస్తాగిరీ సంపాయించగలిగాను. ఆవిడకూడా నలుగురు పిల్లలకు ట్యూషన్‌లు చెప్పి నాలుగు రాళ్ళు గడిస్తోంది. మొత్తానికి మా జీవితనౌక సాఫీగా సాగిపోతూందనే చెప్పాలి.

ఒకనాడు ఎక్కణ్ణించో నాకో ఉత్తరం వచ్చింది. ఆ దస్తూరీ చూసేసరికి గుండెలు జారిపోయాయి. ఆ దస్తూరీ ఎవరిదో కాదు; మా నాన్నగారిదే. ఆత్రతతో ఉత్తరం విప్పి చదివాను. నా కాశ్చర్యం వేసింది. నా ఇష్టం తెలుసుకోకుండా పెళ్ళి ప్రయత్నాలు చేసి నందుకు విచారపడుతున్నారట. నేనే కనక ఆ సమయంలో సాహసించకపోతే తమకు తామే తలవంపులు తెచ్చి పెట్టుకోవలసిన గతి పట్టిఉండేదట. నాకు మాట్లాడిన అమ్మాయి సౌశీల్యం మంచిది కాదని తరవాతగాని తెలి సిందికాదట. చూస్తూ చూస్తూ రొంపిలో దిగ బోయి దైవవశాత్తు తప్పించుకున్నందుకు సంతో షిస్తున్నారట! మొత్తానికి నాన్నగారు తాము చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నారు.

ఆ ఉత్తరంలో మరో విషయం కూడా ఉంది. నేను రాసిన ఉత్తరాలన్నీ చేరాయట. ఆ ఉత్తరాల్లో ఒక్కదాంట్లో అయినా చిరునామా లేకపోవడంచేత ఎక్కడో అక్కడ సురక్షితంగా ఉన్నారు కదా అని తృప్తిపడి ఉండడంకంటె ఏమీ చెయ్యలేకపోయారట.

ఈ విషయం నన్ను నిజంగా ఆశ్చర్యపెట్టింది. నేనేమిటి, ఉత్తరాలు రాయడమేమిటి? పోనీ, మాధవి రాసిందేమో అనుకోవడానికి ఆస్కారం లేదు. మా నాన్న ఎవరో, వారి విలాసమేమిటో తెలీని మాధవి

ఎలా రాస్తుంది? అసలు ఎందుకు రాస్తుంది?

ఇంతలో నా కోసం వెతుక్కుంటూ ఎవరో వచ్చారనీ, బయట కాచుకుని ఉన్నారనీ ఆఫీస్‌బోయ్ చెప్పాడు.

ఈ కన్నుగానని దేశంలో నాకోసం వెతుక్కుంటూ వచ్చే అగత్యం ఏ అప్పుడికి పట్టిందో తెలుసుకోలేక పోయాను. వెళ్లి చూద్దునుకదా. నాన్నగారు! నిజంగానే గుండెలు ఆగిపోయాయి. వారి ఉత్తరాన్ని జ్ఞాపకానికి తెచ్చుకొని కాస్త ధైర్యం తెచ్చుకొన్నాను. ఆఫీసుకి అరదినం సెలవు రాసి నాన్నగారితో ఇంటికి బయలు దేరాను.

ఇద్దరం ఇల్లు చేరుకున్నాము. లోపల మాధవి ఎవరితోనో మాట్లాడుతున్నట్లు అలికిడి అయింది. ఆ రెండవ గొంతు ఎవరిదో మగవాడి గొంతు కావడంచేత ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాను. అతగాడు మమ్మల్ని చూసి — ముఖ్యంగా నాన్నగారిని చూసి — బిక్కమొహం వేశాడు. నాన్నగారు ఎందుకో అత గాణ్ని చూసి, "ఇక్కడికీ దాపరించావా? ఇంకా ఎవడి కొంప ముంచడానికి?" అని తోకతొక్కిన తాచులా మండిపడ్డారు.

నా కిదంతా అగమ్యగోచరంగా ఉంది. ఎవ రీ వ్యక్తి? ఎందుకు వచ్చినట్లు? నాన్నగా రెందుకు అలా కోప్పడు తున్నారు? మాధవి వేపు తిరిగి 'ఏమిటిదంతా?' అన్నట్లు చూశాను.

మాధవి ముసిముసి నవ్వులు నవ్వుతూ, 'మా నాన్నగారు. నన్ను చూడ్డానికి వచ్చారు" అని చెప్పే చెప్పడంతో నాన్నగారు మాధవి వైపు తిరిగి ఆవిణ్ని ఆపాదమస్తకం పరీక్షగా చూసి "ఏమిటీ? నువ్వా!" అని నోరు తెరుచుకుని నుంచుండి పోయారు.

ఆ నూతన వ్యక్తి తెచ్చుకున్న ధైర్యంతో మా నాన్నగారి నుద్దేశించి "అవును, బావా!" అని అందు కున్నారు.

నాన్నగారి పెదవులమీద ఒక్క క్షణం చిరునవ్వు తాండవించింది. నావైపు తిరిగి 'ఏమిట్రా, నువ్వు చేసింది?' అన్నట్టు చూశారు. మాధవివైపు తిరిగి "ఏమే, మాధవీ, నువ్వేనటే మావాణ్ని లేపుకువచ్చింది?" అని చిలిపిగా నవ్వారు.

ఆ కొత్త వ్యక్తి (మా మామగారు) అందుకున్నాడు: "లేదులే, బావా! మనం పెళ్లి చెయ్యడం వాళ్ల కిష్టం లేక, వాళ్లే చేసుకున్నారు. అయినా, ఈ కాలప్పిల్లలకి మనం ఏమిటి చెయ్యడం?"

'అయితే నాకు నాన్నగారు మాట్లాడింది కూడా మాధవినే అన్నమాట' అని అనుకున్నాను. కాని నాన్నగారికి, మామగారికి ఉత్తరాలు రాసి రప్పించిం దెవరో మాత్రం తేలలేదు.

'మాధవి తప్పితే మరెవ్వరు చేస్తారు? అయినా నాన్నగారి ఎడ్రసు మాధవికేం తెలుసు? తెలిసినా ఎందుకు రాస్తుంది? పండంటి కాపరాన్ని బుగ్గిపాలు చెయ్యాలని తనెందుకు కోరుతుంది? బహుశా ఈ రహస్యం తనకే ముందుగా తెలుసేమో! తెలిస్తే ఇంత నాటకం ఆడవలసిన అవసరం ఏమి వచ్చింది?' అని ఆలోచించుకుంటూ కూచున్నాను.

మాధవి నవ్వుతూ కొంటెగా దొంగచూపులు చూస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని ప్రశ్నించింది.

"ఏమిటీ నాటకం అంతా?"

"ఏమో! నాకేం తెలుసు?"

"తెలీదేం? పాపం..."

"అదేమిటండోయ్?"

"నిజం చెప్పు! మా నాన్నగారిని ఇంతకుపూర్వమే నీ వెరుగుదువా?"

"ఎందు కెరగను? నన్నడగడానికి మా ఇంటికి అప్పు డప్పుడు వచ్చేవారు."

"అయితే వారి ఎడ్రసు నీ కెలా తెలుసు?"

"మీ డైరీలోంచి . . ."

"వారు మా నాన్నగారు అనికూడా తెలుసునన్న మాట."

"ఎందుకు తెలీదు? వారు నా ఫోటో మా నాన్న గారికి చూపడానికి తెచ్చినప్పుడే తెలుసుకున్నాను."

"తెలిస్తే ఈ నాటకం ఆడవలసిన అవసరం ఏం వచ్చింది?"

"మీనాన్నగారడిగిన కట్నాలూ, కానుకలూ ఇచ్చుకునే శక్తి మా నాన్నగారికి లేదు."


"అయితే?"

"మే మిచ్చుకోలేమని తెలిసీ మా నాన్నగారే మన పెళ్లికి అడ్డు పడవచ్చు."

"అందుకని?"

"ఈ నాటకం ఆడవలసి వచ్చింది."

"ఏమిటీ! అమ్మ దొంగా, ఎంత పని చేశావ్!" ఆవిరి పట్టుకోబోయాను. బాణానికిమల్లే తుర్రుమని దూసుకుపోయింది. ★



సింహాచలం గుడిలో రాతిరథం ఫోటో—కె. వరోజిని (విశ్వరంజన్)